సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

ప్రవేశానికి పాట్లు

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ లోపలికి వెళ్లేందుకు ఒకే ఒక్క గేటు దిక్కుగా మారింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఆసుపత్రికి సంబంధించిన అంబులెన్స్‌లతో పాటు కాలినడకన ఆసుపత్రికి వచ్చే రోగులు.. అంతా ఒకే ఒక్కటైన ఈ గేటు గుండా లోపలికి వెళ్లాల్సి వస్తోంది. ఇదే పెద్ద సమస్య అనుకుంటే ఈ గేటు పరిసరాలు పూర్తిగా ఆక్రమణలతో నిండిపోయి సమస్య మరింత జటిలమవుతోంది.





కేజీహెచ్ ప్రవేశ ద్వారం వద్ద ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల రద్దీ

- కేజీహెచ్‌లో రాకపోకలకు ఒక్కటే మార్గం
- ఇబ్బంది పడుతున్న రోగులు, సిబ్బంది, వాహన చోదకులు
- ఆర్చి నిర్మాణం కోసం ఇన్‌గేట్ మూసివేత

మహారాణిపేట : 1200 పడకల సామర్థ్యం గల కేజీహెచ్‌కు నిత్యం రోగులు, వారి సహాయకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఇంకో వైపు వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో బిజీగా ఉంటుంది. గతంలో కేజీహెచ్ లోపలికి రాకపోకలు సాగించేందుకు ఒక్క దారే ఉండేది. దీని వల్ల వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. తరచు ట్రాఫిక్ జామ్ అయ్యేది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేజీహెచ్‌లో ఇన్‌గేటు, అవుట్ గేటు వేర్వేరుగా నిర్మించారు. దీంతో రద్దీకి కట్టడి పడింది.

ఆర్చిల నిర్మాణమే కారణం!

కేజీహెచ్ మెయిన్ గేటు వద్ద ఆర్చిల నిర్మాణ పనులు చేపట్టారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. మరో ఆరు నెలల వ్యవధిలో పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ పనుల కోసమే ప్రధాన రహదారి గుండా రాకపోకలు నిలుపుదల చేశారు. అయితే సంబంధిత అధికారులు రద్దీ నియంత్రణపై కూడా దృష్టి సారిస్తే బాగుంటుందని రోగులు, కేజీహెచ్ సిబ్బంది చెబుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తే ఫలితముంటుంది

కేజీహెచ్ మెయిన్ గేట్ పరిసరాలు పూర్తిగా ఆక్రమణలతో నిండిపోయాయి. ఇక్కడ వివిధ రకాల ఉత్పత్తులను విక్రయిస్తూ వ్యాపారులు పూర్తిగా రద్దీగా మార్చేసారు. గేటు దాటి లోపలికి వెళ్లాలంటే పద్మవ్యూహంలోకి అడుగు పెట్టినట్లే ఉంటుంది. రోగులు, వారి సహాయకులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ఇన్‌గేట్.. అవుట్‌గేట్ ఒక్కటే కావడం దీనికి కారణం.

నాలుగు రోజులు ఒకటే రద్దీ

సోమవారం నుంచి గురువారం వరకు కేజీహెచ్‌కు రోగుల సంఖ్య భారీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో ప్రవేశానికి వాహన చోదకులు, రోగులు, పాదచారులు, వైద్యులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అవుట్ గేటు వద్ద భారీగా వాహనాలు, జనం రద్దీ వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుంది. గేటు దాటి రోడ్డు మీదకి చేరుకుంటే అక్కడ బస్టాపు వల్ల ప్రయాణికుల రద్దీ ప్రతిబంధకంగా మారుతోంది. కేజీహెచ్‌కు వచ్చే రోగులు, వాహనాలు, అంబులెన్స్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అవుట్ గేట్ వద్ద రాకపోకలకు వెసులుబాటు కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే కేజీహెచ్ ఓపీ గేటులోకి ప్రవేశం నిషేధించారు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే వాహనాలకు అనుమతి ఇస్తున్నారు.



రద్దీగా ఉన్న కేజీహెచ్ అవుట్ గేటు

ప్రత్యామ్నాయం చూపాలి

కేజీహెచ్ రద్దీ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయం చూపాలని రోగులు, సిబ్బంది కోరుతున్నారు. ఈ గేటు నుండి లోపలికి వెళ్లాలన్నా.. బయటికి రావాలన్నా ప్రయాసగా ఉందని పలువురు చెబుతున్నారు. చివరికి అత్యవసర పరిస్థితుల్లో వచ్చే అంబులెన్స్‌లకు కూడా ఇక్కడ దారి దొరకడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులకు దీనిపై దృష్టి సారించి ఈ సమస్యను పరిష్కరించాలని రోగులు, వైద్యులు, సిబ్బంది కోరుతున్నారు.

క్లుప్తంగా

మార్యాదపూర్వక కలయిక



సీపీ త్రివిక్రమవర్మను అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం మార్యాదపూర్వకంగా కలిసారు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అన్నదానానికి ఆర్థిక సాయం



అన్నదానానికి ఆర్థిక సాయం చేస్తున్న 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు

దాబాగార్డెన్స్: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని దక్షిణ నియోజకవర్గ పరిధి 36వ వార్డు కాకరవీధిలో అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి ఆ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు దంపతులు రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాకరవీధి ప్రెసిడెంట్ జీఏ రాజు, వార్డు నాయకులు నర్సింగరావు, గోవిందరావు, వీర్రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా బస్ స్టేషన్లో ఆధార్ సెంటర్



కార్గో సెక్షన్‌ను తనిఖీ చేస్తున్న రవికుమార్, అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: ద్వారకా బస్ స్టేషన్లో ఆధార్ సెంటర్‌ను ఏపీఎస్‌ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రవికుమార్ గురువారం ప్రారంభించారు. ఆయనతో పాటు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బి. అప్పలనాయుడు కార్గో సెక్షన్, బస్సుల ఎమర్జెన్సీ డోర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ షిప్‌మంత్ర ఆన్‌లైన్ పార్శిల్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. ఆధార్ సెంటర్ వారం రోజుల పాటు పని చేయనుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న డీసీపీ



సంపత్ వినాయగర్‌కు పూజలు చేస్తున్న డీసీపీ దంపతులు

సీతమ్మధార : పోలీస్ కమిషనరేట్ పరిధిలోని డీసీపీ–1గా బాధ్యతలు చేపట్టిన విద్యాసాగర్ నాయుడు గురువారం సతీమణితో సంపత్ వినాయగర్ ఆలయంలో పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు మోహన్‌స్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం డీసీపీ విద్యాసాగర్ నాయుడితో పాటు సతీమణి భవ్య నామగోత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ప్రసాదం అందించారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రతినిధి చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నసమారాధన

అల్లిపురం: భక్తుల సహకారంతో కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శుభప్రభ హోల్డింగ్స్ సంస్థ తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని ఆలయ కార్యదర్శి బొడ్డు పోలారావు తెలిపారు. ప్రతి నెల ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని సంస్థ డైరెక్టర్ లక్ష్మీ గణపతి కుమార్, సూర్య పవన్ అనుషిత తెలిపారు. ముందుగా వారు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వారు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, సలహాదారులు బొడ్డేటి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ పంపాన గణేష్, జాయింట్ సెక్రటరీ బడే నాగరాజు, కోశాధికారి వాసుపల్లి నారాయణ, సహ కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మక్కా మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న డాక్టర్ జహీర్ అహ్మద్

దాబాగార్డెన్స్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ గురువారం జగదాంబ జంక్షన్ సమీపాన గల మక్కా మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ నెల రోజులు సూర్యోదయం నుంచి, సూర్యాస్తమయం వరకు కనీసం మంచినీళ్లు కూడా తాగకుండా ముస్లింలందరూ ఉపవాసం చేస్తారన్నారు. ఆ సమయంలో పవిత్రంగా ప్రార్థనలు చేస్తారని చెప్పారు. రంజాన్ ప్రారంభమైన 20వ రోజు రాత్రంతా మసీదులో దేవుడి ప్రార్థనలో గడుపుతారని, ఆ సందర్భంగా ఎవరైతే ఉపవాసం చేస్తారో ఆ సాయంత్రం ఉపవాసం ఉపహరించుకునే సమయమే ఇఫ్తార్ అంటారని పేర్కొన్నారు. 20వ రోజు సందర్భంగా వందలాది మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ చైర్మన్ మక్సూద్ అహ్మద్, డాక్టర్ ముస్తాక్ అహ్మద్, రిజ్వాన, తాజ్, ఎఫ్ఆర్ ఖాన్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



షేక్ సలీమ్ (ఫైల్)

అల్లిపురం: భార్యతోగొడవ పడి ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయాడు. ఈ మేరకు అతని భార్య షేక్ మీరాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపురం, దేవాంగుల వీధి ప్రాంతానికి చెందిన షేక్ సలీమ్ చికెన్ సెంటర్‌లో కట్టర్‌గా పని చేస్తున్నారు. గత నెల 30వ తేదీన భార్యాభర్తల మధ్య మాటామాటా పెరగటంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన షేక్‌సలీమ్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని భార్య షేక్ మీరాబీ తెలిసిన వారి ఇళ్లలోను, నగరంలో పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేక పోలీసులను ఆశ్రయించింది. షేక్ సలీమ్ వయస్సు 27 సంవత్సరాలు. 5 అడుగుల 5 అంగుళాల ఎత్తు, నలుపు రంగు ఛాయతో ఉంటాడని, ఇంటి నుంచి వెళ్లిపోయినప్పుడు పచ్చ కలర్ షర్టు, నలుపు కలర్ ప్యాంటు వేసుకున్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 0891-2783672, 9849258484 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

హస్త కళాకారులకు ప్రోత్సాహం

దాబాగార్డెన్స్: గ్రామీణ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను పట్టణాల్లో విక్రయించి, వారిని ప్రోత్సహించడమే నాబార్డ్ లక్ష్యంగా పని చేస్తోందని నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ డీజీఎం కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నాబార్డ్ ఆర్థిక సహకారంతో నేస్తం సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఇన్ మాల్ పేరిట పట్టణాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి వాటిని అందుబాటు ధరలకే విక్రయిస్తున్నట్టు చెప్పారు. నగరంలోని ఓ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 12 వరకు హస్త కళాకారుల ఉత్పత్తుల విక్రయాలు జరుగుతాయని తెలిపారు. హస్త కళాకారులకు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా వసతి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. మహా విశాఖ ప్రజలు హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. నాబార్డ్ విశాఖ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు, నేస్తం ఎన్జీవో సంస్థ సురేష్ మాట్లాడుతూ ఈ స్టాల్స్‌లో హస్త కళాకారులు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు లభిస్తాయన్నారు.



స్టాల్‌ను ప్రారంభిస్తున్న నాబార్డ్ ఏపీ డీజీఎం కేవీఎస్ ప్రసాద్

ఆసక్తికరంగా నాటక ప్రదర్శనలు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (వీఎండీఏ) ఆధ్వర్యంలో మద్దిపాలెం కళాభారతిలో జరుగుతున్న పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో భాగంగా రెండో రోజు గురువారం ప్రదర్శించిన రెండు నాటక ప్రదర్శనలు ఆసక్తికరంగా సాగాయి. రెండో రోజు ప్రదర్శనలను వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సీనియర్ నటుడు, రచయిత మిశ్రో ముఖ్యఅతిథులుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో చంద్రమామ రావే.. నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకాన్ని శిష్టా చంద్రశేఖర్ రచించగా, ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. బిడ్డకు బువ్వ పెట్టడానికి అమ్మ చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపించి బిడ్డ బతకు కోరుకుంటుంది. అదే అమ్మ వృద్ధాప్యంలో చిన్న చిన్న అవసరాలకు పడే వెతలను కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించి కళాకారులు అందరి మన్ననలు పొందారు.

- అనంతరం మనదేశంలో రోజురోజుకు ఆడబిడ్డలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఇతివృత్తంగా కత్రిపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రక్షాళన నాటకాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు.

ఈబీసీ నేస్తంతో చక్కటి భరోసా



ఈబీసీ నేస్తం లబ్ధిదారులతో రంథి గోపి, బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ అన్నారు. ఈబీసీ నేస్తం లబ్ధిదారులతో కలిసి ఆయన గురువారం గౌరీవీధి సచివాలయం వద్ద ముఖ్యమంత్రికి కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. లబ్ధిదారులు లక్ష్మీ నరసమ్మ, నాగమణి మాట్లాడుతూ ఉన్నతవర్గాల్లో పుట్టినా ఆర్థికంగా తాము వెనుకబడి ఉన్నామన్నారు. అలాంటి తమను గుర్తించి రూ.15 వేలు ఆర్థిక చేయూత అందజేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తాము ఎల్లప్పుడు రుణపడి ఉంటామన్నారు. ముఖ్యమంత్రి సహాయంతో తమకు భరోసా లభించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు, ఇన్‌చార్జి అడ్మిన్ పీవీ కిరణ్‌కుమార్, జాన్ బాబు, వలంటీర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

సాగర తీరంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పి.వి.సునీల్‌కుమార్

బీచ్ రోడ్డు: సాగర తీరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏపీ అడిషనల్ డీజీపీ (అగ్నిమాపక) పి.వి.సునీల్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ నేటి తరానికి ఆదర్శమన్నారు. సమాజంలో అసమానతలను తొలగించడంలో అంబేద్కర్ పాత్ర కీలకమైందన్నారు. అంబేద్కర్‌ను ఒక్క వర్గానికే పరిమితం చేయడం తగదన్నారు. ఆయన అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, రొయ్యి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వస్త్రాల పంపిణీ



రోగులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి. చిత్రంలో డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా గురువారం కేజీహెచ్‌లో వైఎస్సార్‌టీయూసీ యూనియన్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోగులకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. దేశానికి అంబేద్కర్ అందించిన సేవలను కొనియాడారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు జంగా త్రిమూర్తులు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఇంటి గురుమూర్తి, యూనియన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ రమణ, సెక్రటరీ ఎ.రామారావు, పి.అప్పలస్వామి, ఎస్.రాజారావు, వెంకటరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త సీఎం జగన్

- 32వ వార్డులో చురుగ్గా 'జగనన్నే మా భవిష్యత్తు'



లబ్ధిదారులతో ఎమ్మెల్యే వాసుపల్లి, వార్డు కార్పొరేటర్ మూలే రామిరెడ్డి



ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న మహిళను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు రంథి గోపి, యల్లంకి చిన్నమ్మలు



వెంకటపతిరాజునగర్‌లో ఒక ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న నాయకులు

అల్లిపురం: సంక్షేమ పథకాల సృష్టికర్త ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 32వ వార్డు అల్లిపురం, కర్లాలవీధిలో వార్డు అధ్యక్షుడు మూలే రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. జగనన్న ప్రభుత్వంలో ఏ పథకాల ద్వారా లబ్ధి పొందారో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే, పిల్లల భవిష్యత్ బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డు అధ్యక్షుడు శంకభక్తుల సన్యాసిరావు, జేసీఎస్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎల్లపు రఘురామ్, పాల శ్రీహరిరెడ్డి, వార్డు మహిళా అధ్యక్షురాలు బంగారమ్మ, సురపతి అప్పన్న, సౌత్ ఎస్సీసెల్ అధ్యక్షుడు బోణి దేవ, బాబుల్ శ్రీను, భానుమూర్తి, బొడ్డేటి కిషోర్, గోవింద్, కోటి, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, లక్ష్మి, కృష్ణవేణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరమెట్టలో..

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. వార్డు మహిళా అధ్యక్షురాలు, కన్వీనర్ యల్లంకి చిన్నమ్మలు ఆధ్వర్యంలో ఎరుకలవీధిలో జరిగిన కార్యక్రమంలో రంథి గోపికృష్ణతో కలిసి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో భవానీ, వెంకటలక్ష్మి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

దాబాగార్డెన్స్: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం గురువారం 7వ రోజుకి చేరింది. నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలు, వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షుల నేతృత్వంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు వివరిస్తూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఎన్నుకోవాలని అభ్యర్థించారు. 30వ వార్డు అంగటిదిబ్బ 177 సచివాలయం, 28వ వార్డు పందిమెట్ట 164 సచివాలయం, 37వ వార్డు 184 సచివాలయ పరిధి పెయిందొరపేట, 29వ వార్డు 176 సచివాలయ పరిధి వెంకటపతిరాజునగర్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి పీతల వాసు, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, 28వ వార్డు నాయకుడు పల్లా దుర్గారావు, రాపాక శ్రీను, సత్యనారాయణ, నీలాపు లక్ష్మి నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో బెవర మహేష్, అరుగుల రాజ్‌కుమార్, కోరాడ సురేష్, అడపా శివ, కనకల దేవి ప్రసన్నకుమారి, వద్దాది దిలీప్, వెంకట్, కల్యాణి, సారిపల్లి అప్పలరాజు, ఆకుల శ్యామ్, మీనా, కాసారపు వాసు, నొల్లు చంటి, డేవిడ్‌రాజు, రోజా తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవలో 24 మంది, శ్రీచక్రానవవర్ణార్చన, లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

15న 'మనసా కవ్వించకే నన్నిలా..'

దాబాగార్డెన్స్: కళాంజలి సినీ, సంగీత సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న జరగనున్న సినీ సంగీత విభావరి విజయవంతం చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆకాంక్షించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి 49వ వర్ధంతిని పురస్కరించుకుని కళాంజలి సినీ సంగీత సాంస్కృతిక సంస్థ నిర్వహించనున్న కార్యక్రమ పోస్టర్‌ను గురువారం మేయర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు కె. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 15 సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా మనసా కవ్వించకే నన్నిలా..పేరిట ఎస్పీ కోదండపాణి చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. న్యూరోషన్‌లాల్ ఆర్కెస్ట్రా బృందం సంగీత సారథ్యం వహిస్తున్న విభావరిలో కె. రాజేంద్రప్రసాద్, శంబర జోగారావు, ఫణిభూషణ్, రమేష్ పట్నాయక్, కేఎస్ ప్రకాష్, మూలా శ్రీలత, పద్మజ, అక్కినపల్లి శైలజ వంటి గాయనీ గాయకులు కోదండపాణి స్వర పరిచిన గీతాలు ఆలపించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ఎన్ రాజు, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున మేయర్ హరివెంకటకుమారి

సినీ దర్శకుడు ప్రభాకర్‌కు సత్కారం

దాబాగార్డెన్స్: విశాఖలో ప్రతిభ గల కళాకారులకు కొదవలేదని కళింగ వైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు అందవరపు కోటేశ్వరరావు అన్నారు. సినీ దర్శకుడు ఆరిపాక ప్రభాకర్ విశాఖ జర్నలిజం రంగం నుంచి సినీ దర్శకుడిగా ఎదిగి, కర్ణాటకలో ఉత్తమ దర్శకుడిగా అవార్డు పొందడం అభినందనీయమన్నారు. విశాఖకు చెందిన ఆరిపాక ప్రభాకర్ తొలిసారిగా దర్శకత్వం వహించిన కన్నడ చిత్రానికి కర్ణాటకలో వరుసగా మూడు అవార్డులు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సనరా–చందు ఆర్ట్స్ మూవీస్ ఆధ్వర్యంలో ఆత్మీయ పురస్కారంతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా అందవరపు కోటేశ్వరరావును విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, సీనియర్ జర్నలిస్ట్ ఎస్. నాగేశ్వరరావు, సనరా వంశీ, గంట చంద్రశేఖర్, దాడి రవికుమార్, నాగరాజ్ పట్నాయక్, డేవిడ్ రాజు, నేమాల హేమసుందర్, గొండు అచ్యుతరావు, బాదంగీర్‌సాయి, గడసాపు శ్రీను, పట్నాన శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.